## పేరు మీరే పెట్టండి

అనేక పత్రికలు, నవలలు చదివే మీలోని ఊహాశక్తిని ఉపయోగించండి. ఈ కింది కథ చదివి దానికి ఏ పేరు పెడితే బావుంటుందో ఊహించి కింది బాక్సులో మీరే రాయండి.

చంద్రుడ నిప్పుల్ని కురిపిస్తున్నాడు. సూరీడు. కావ్...కావ్...కావ్ మని అదే పనిగా అరుస్తూ (ఎందుకో) ఎగురుతూ ఉందో కాకి, అది చాలా కోపంగా కూడా ఉంది. అప్పటికి రెండు గంటలకు పైగా కొనసాగుతున్న దాని ప్రయత్నం,గుక్కెడు నీళ్ళు త్రాగాలన్న దానికోరిక ఇలా విఫల మౌతూందేమిటి? కనిపించిన ప్రతి బాన లోనూ రాళ్లు వేసింది నీళ్లు పైకి వస్తాయి గదా అని. చివరికి శ్రమే మిగిలింది గానీ నీళ్లు కనిపించనైనా లేదు. అలసిపోయి ఒక చోట కూల(నీల)బడింది. ఇంతలో ఠఫ... ఠఫ... శబ్దంచేస్తూ ఓ బాతులాంటి పక్షి దాని ప్రక్కలోనే వాలింది. కాకి ఆశ్చర్యంగా చూడటం గమనించి. "హల్లో కాకి మామయ్యా! ఏమిటంతలా ఆశ్చర్యపడుతున్నావ్ నేను బాతుపాపనే. ఎంచక్కా ఎగిరేస్తున్నా కదూ! మరేం చెయ్యను? మా పూర్వీకులు ఐతే చెఱువుల్లోనూ, సరస్సుల్లోనూ పడవల్లా తేలుతూ ఈత కొట్టే వారటగా? అబ్బ వాళ్ళెంతటి అదృష్టవంతులో కదా! ఏదీ మాతరం వాళ్ళకి ఈత బొత్తిగా రాకపోయె. పోనీ ప్రాక్టీసు చేసుకుందామంటే స్విమ్మింగ్ (పూల్స్) క్లబ్స్ అన్నీ మూతబడ్డాయి, అందుకే మా మమ్మీ ఫ్లైయింగ్ క్లబ్బులో చేర్పించింది నన్ను. ఈ హైద్రాబాద్‌లో మనుషులు త్రాగటానికే నీళ్లు లేవు ఇక మాలాంటి వాళ్ళు ఈతనేర్చుకోటానికి ఎక్కడ్నుంచి వస్తాయి చెప్పు?" ఆయాసపడుతూ ఆపింది బాతుపాప. అలాగా పాపం! అనుకుంది కాకి. ఇంతలో సమీపంలోనే ఉన్న "నల్ల" బుస్సుస శబ్దంచేయటం ప్రారంభించింది. ఎక్కడినుంచూడి పడ్డారో మరి నిముషంలో దానిచుట్టూ మూగి 'కాకి' గోల ప్రారంభించారు. "నల్ల" శబ్దం చెయ్యటం మాని రెండు మూడు 'కన్నీటి' చుక్కల్ని రాల్చి నిట్టూర్చింది. "అరె ఇస్స...థూ..." అని తిట్టుకుంటూ ఎక్కడి వాళ్ళక్కడ సర్దుకున్నారు జనమంతా. తిరిగి కాకి, బాతు మిగిలారా ప్రాంతంలో. "అయితే నీకు నీళ్లు తాగాలని ఉందన్నమాట" అడిగింది బాతు పాప. సిగ్గుగా తల వూపింది కాకి. "ఐతే నాతోరా రాయలసీమకు పోయి తెలుగు గంగలో నీళ్ళు తాగొద్దాం."అని ఎగిరింది బాతు. దాన్ని అనుసరించింది కాకి "సీమకుపోదాం నీళ్ళను తాగుదాం ఛలో...ఛలో..." పాడుకుంటూ.

–కె.జె. ప్రమిద
(రాయచోటి)

స్రవంతి నెం: 13లో ఈశీర్షికలో ప్రచురించిన కథకి రచయిత శ్రీ ఎస్. వెంకట్రామిరెడ్డి పెట్టిన పేరు: రాతిపూజ

ఈ వారం ఈ శీర్షికలో కథల ఎన్నికల గెస్ట్ ఎడిటర్ : శ్రీమతి డి. కామేశ్వరి




"పుట్టి ఏభైఏళ్ళు, రచయిత్రిగా పాతికేళ్ళ అనుభవం - రాసినవి ఓ మూడు వందల కథలు, పాతిక నవలలు. ఇప్పుడున్న ట్రెండ్‌తో పోటీపడే ఓపిక, ఉత్సాహం లేక రాయడం తగ్గించుకున్నాను." మనసులో ఉన్నది ఉన్నట్టు తేటతెల్లంచేసిన ప్రముఖ రచయిత్రి శ్రీమతి డి. కామేశ్వరి, కథా రచనమీద మాట్లాడుతూ "రచన అన్నది కేవలం కాలక్షేపం కోసంకాక ఓ ప్రయోజనం ఉండాలని ఆశిస్తాను. అకారణంగా ఎక్కువ ఆనాడూ రాయలేదు, ఈనాడు లేదు" అన్నారు.

ఈనాటి రచయిత్ర(త్రు)ల నుద్దేశించి ఆమె "ఈనాటి రచయితలు కాసింత వైలన్స్ తగ్గిస్తే (రచనల్లో సుమా !)బావుంటుందేమో ! కథ, కథనంలో మంచి శిల్పం కనబరుస్తూ ఓ విషయం క్షుణ్ణంగా శోధించి, పరిశీలించి రాయాలన్న తపనతో రాయడం ముదావహం !" అన్నారు.

"రచయిత్రుల శకం ముగిసి, రచయితల శకం ఆరంభమైంది-సంతోషమే !" అంటూ మార్పుపట్ల తన సంతోషాన్ని ప్రకటించారు.

పాఠకులూ మరి మీరూ... కథల్ని చదివి సంతోషించండి !




## ఎత్తుకు పై ఎత్తు

చెప్పా చెయ్యకుండా కుటుంబ సమేతంగా విచ్చేసిన వినయమూర్తివైపు విస్మయంగా చూశాడు ఆతడి మామ ఆనందరావు. ఆనందరావు ఓ హైస్కూలు ఉపాధ్యాయుడు.

## స్రవంతి నెం: 11లో ఇచ్చిన

"గృహప్రవేశమయిన రెండేళ్ళదాకా ఇల్లుకట్టలేనండీ" అన్నాడు వినయమూర్తి వినయంగా మామగారితో

## వాక్యం ఆధారంగా రాసిన కథలు

"నాకీ ఊరు ట్రాన్స్‌ఫర్ అయిందండీ. అర్జంటుగా జాయినవ్వాలి. అందుకనే అర్జంటుగానే వచ్చేసాను" అన్నాడు మూర్తి సామానంతా ఇంట్లో పెట్టిస్తూ.

ఆ మాటకు అదిరిపడ్డాడు ఆనందరావు, ఇక ఈ ఇంట్లోనే తిష్ఠ వేస్తాడేమోనని. అయినా ఆ భావం పైకి కన్పించనీయలేదు.

పదిహేనురోజులు గడిచాయి.

"బాబూ! స్థలంకొన్నావట! అమ్మాయి చెప్పింది" అన్నాడు ఆనందరావు భోజనాల దగ్గర.

"అవునండీ. మా ఆఫీసువాళ్ళంతా తీసుకుంటుంటే నేనూ ఒక ప్లాట్ తీసుకున్నాను. వచ్చే నెలనుంచి ఇంటిపని ప్రారంభించాలనుకుంటున్నాను" చెప్పాడు మూర్తి.

నెల గడిచింది. జీతాలందినా మూర్తి ఒక్క రూపాయికూడా మామగారికివ్వలేదు. కనీసం మర్యాదకుకూడా.

"తిన్నన్నాళ్ళూ ఇంతేకాబోలు! ఇలా అయితే నా పని గోవిందా!" అనుకుని ఎలాగైనా అతనిని వేరేకాపురం పెట్టించాలనుకున్నాడు ఆనందరావు.

ఒకరోజు

"బాబూ! ఆ ఇంటిపనేదో తొందరగా చేసి అందులోకి వెళ్తేగాని మీకు సుఖం ఉండదు. ఈ చిన్న ఇంట్లో రెండు కుటుంబాలవల్ల నీకు ఇబ్బంది అవుతున్నట్టుంది" అన్నాడు.

"ఫరవాలేదండీ. ఎలాగోలా సర్దుకుంటాగానీ కొత్తగా ఇల్లు వెంటనే కట్టెయ్యాలంటే మాటలా! మీ ఇంట్లో గృహప్రవేశమయిన రెండేళ్ళదాకానీ కొత్తయిల్లు కట్టలేనండీ" అన్నాడు వినయమూర్తి మామగారితో సవినయంగా.

ఒక్కక్షణం ఆనందరావు గుండె ఆగినట్టయింది. "రెండేళ్ళంటే 48వేలు సుమారు. అయ్యబాబోయ్!" అని కొంచెంసేపు ఆలోచించి ఒక నిశ్చయానికి వచ్చాడు.

పదిరోజులు గడిచాయి.

ఉదయాన్నే నిద్రలేచిన మూర్తి ఇంటి ముందున్న లారీలో సామానెక్కిస్తున్న ఆనందరావుని చూసి, ఆశ్చర్యంగా...

"ఏమిటి మామగారూ! ఈ ప్రయాణం?" అన్నాడు.

"ఏం చెప్పను బాబూ! అనుకోకుండా నాకూ ట్రాన్స్‌ఫర్ అయింది. ముందుగా చెప్తే నువ్వు బెంగపడతావని చెప్పలేదు. జాగ్రత్త బాబూ!" అని చెప్పేసి లారీ ఎక్కేసాడు.

మూర్తి పెత్తువ ఎప్పై త్రవేసి కోరి ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నట్టు తెలియని వినయమూర్తి విభ్రాంతిగా చూస్తూ నిలబడిపోయాడు. *

— యం. గోపాలకృష్ణమూర్తి
(నీలానగరం)

# చెప్పుదెబ్బ

లక్షలార్జించినా డబ్బుకు గడ్డితినే రంగనాథం కూతురు సుందరి పెళ్ళినికూడా వాయిదా వేయసాగాడు.

ఇక లాభం లేదని వరాన్వేషణకు బయల్దేరాడు పీనాసి రంగనాథం.

ఎక్కడ చూసినా పెళ్ళికొడుకుల రేటు 'లకారం' పైనేగాని కిందలేదు.

శ్రమపడి గుంటూర్లో కుప్పిగంతుల ఆదికూర్మం కొడుకు వినయమూర్తిని అరవైవేలకు సెటిల్ చేసుకొచ్చాడు. ఏడుస్తూ...

కట్నం పెళ్ళిలో ఇస్తానన్నాడు.

అమ్మమ్మ పోరు పడలేక, లోలోపల ఉడుకుతూనే దర్జాగా ఏర్పాట్లు చేయించాడు రంగనాథం.

కానీ పెళ్ళి టైంకు వియ్యంకుడు ఆదికూర్మాన్ని పక్కకు పిల్చి ముప్ఫయివేలు చేతిలో పెట్టి, "ఇవి కాస్త అనుకోండి... డబ్బు అడ్జస్టుకాలేదు. శుభకార్యం ఆపొద్దు" అంటూ డ్రమెటిక్‌గా ఏడ్చాడు.

రంగనాథం కుక్కబుద్ధి అర్థం చేసుకున్న ఆదికూర్మం పెళ్ళి అయ్యేదాకా ఏం మాట్లాడకుండా, పెళ్ళయిన తరువాత కొడుక్కు మామాసురుడి ప్లాను చెప్పాడు.

మామకు బుద్ధి చెప్పాలనుకున్నాడు వినయమూర్తి. ఆ సాయంత్రం అల్లుణ్ణి డాబామీదికి పిల్చుకెళ్ళాడు రంగనాథం.

"అల్లుడుగారూ... అనవసరంగా కట్నండబ్బు దుబారా చెయ్యకుండా ఓ ఇల్లు కట్టిస్తే మీరూ, అమ్మాయీ సెపరేట్‌గా ఉండొచ్చుగా?" పొడిచేసాడు రంగనాథం.

"చూడండి మామగారూ... మీకు తెలీదనుకుంటా, మాకు లక్ష రూపాయల అప్పుంది... అది తీరాలంటే పొలం అమ్మాలి... ఈ వ్యవహారాలయ్యేసరికి ఓ సంవత్సరం ఎటూ పడుతుంది. చూసారూ, అందుకే ఇప్పట్లో మీ అమ్మాయిని తీసుకెళ్తే ఖర్చు జాస్తి అవుతుంది. కాబట్టి మీ అమ్మాయిని ఒక సంవత్సరం మీ ఇంట్లోనే ఉంచుకోండి... అప్పు తీరింతర్వాత అంపకాలు, గృహప్రవేశాలు చేసుకుందాం."

"మరి ఇల్లు..."

"వ్యవహారం పూర్తయి, మీ అమ్మాయి మా ఇంట్లో గృహప్రవేశమైన రెండేళ్ళకు గానీ ఇల్లుకట్టలేనండీ" వినయంగా అన్నాడు వినయమూర్తి.

రంగనాథానికి అల్లుడుకొట్టిన చెప్పుదెబ్బ అర్థమైంది. గబగబా వెళ్ళి కొరత కట్నండబ్బు తెచ్చి వినయమూర్తికిచ్చి, "బాబూ ఇవి కాళ్ళనుకో... దయచేసి అమ్మాయిని మీ ఇంటికి తీసుకెళ్ళు" అల్లుణ్ణి అర్థించాడు.

డబ్బువేపు చూస్తూ, "సరే... మీరు ఇంతగా ప్రాధేయపడుతున్నారు కాబట్టి." చిరునవ్వు చిందిస్తూ వినయంగా అన్నాడు వినయమూర్తి.

— బిట్రగుంట సాయిబాబా
(ఒంగోలు)

### ఓ కథ రాయండి

ఈ క్రింద ఇచ్చిన వాక్యాన్ని కథలో ఎక్కడయినా ఉపయోగించి అచ్చులో అరపేజీ మించకుండా ఓ కథని రాసి వెంటనే పంపండి. ప్రచురణార్హమైన కథా రచయితలకి పాతిక రూపాయలు పారితోషికం పంపబడుతుంది.

**"తల్లిలాంటి వదినపై చేయిచేసుకోవడానికి నీకు మనసెలా ఒప్పిందిరా మూర్ఖుడా!" అన్న అక్క మాటలతో, ఆలోచిస్తున్న మధు ఈలోకంలోకి వచ్చాడు.**